
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.2
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 1 జూలై 2024



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.20 (122.0338)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.66 (2.70)	78.39	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.48 (0.39)	50	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.194 | స్కిన్‌లెస్ : రూ.224



చెరువులపై నజర్

రియల్టర్ల భూదాహం, అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా పట్టణాల్లోని చెరువులు, కుంటలు క్రమేపీ రూపు కోల్పోతున్నాయి. వర్షాకాలంలో వాటికి వచ్చే వరదను పైభాగంలో ఉన్న చెరువులు, నదులకు చేర్చే కాల్వల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని కబ్జాలకు గురవుతుండ గా, మరికొన్ని శాశ్వతంగా కనుమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని కాపాడేందుకు రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు.

- భువనగిరి టౌన్

- పట్టణాల్లో కబ్జాకు గురవుతున్న చెరువులు, కుంటలు
- వాటిని రక్షించేందుకు రాష్ట్రస్థాయిలో కార్యాచరణ
- 48 అంశాలు, అభివృద్ధిపై సూక్ష్మ ప్రణాళికలు 5వ తేదీ లోగా అందజేయాలని కమిషనర్లకు ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలోని 19మునిసిపాలిటీల్లో 100చెరువులు, కుంటలు

ఒకప్పుడు నిండుకుండలా ఉంటూ పట్టణాల్లో భూగర్భజలాల నీటి మట్టం భద్రతకు దోహదపడిన చెరువులు, కుంటలు నేడు కనీస నీటి మట్టానికి కూడా నోచుకోలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో పట్టణాల్లోని చెరువుల సంరక్షణకు మునిసిపల్‌శాఖ చర్యలు చేపట్టింది. పట్టణాల్లోని చెరువులు, కుంటలను గుర్తించి వాటి పూర్వపరాలు, నేటి స్థితిగతులపై ఈ నెల 5 తేదీలోగా 48 అంశాలతో సమగ్ర నివేదిక, అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికలు ఇవ్వాలని మునిసిపల్ పరిపాలనా విభాగం సంచాలకుడు మునిసిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని 19 మునిసిపాలిటీల పరిధిలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి చెరువుల వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు మునిసిపల్ యంత్రాంగం కుస్తీ పడుతోంది.

చెరువుల పునరుజ్జీవమే లక్ష్యం

పట్టణాల ప్రగతిలో కీలకంగా ఉండి, నేడు భద్రత కరువైన చెరువుల పునరుజ్జీవమే లక్ష్యంగా మునిసిపల్ శాఖ అడుగులు వేస్తోంది. అందులో భాగంగా చెరువులు, కుంటల ఆక్రమణల నియంత్రణకు చర్యలు చేపట్టింది. ప్రతీ చెరువులో ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) హద్దుల ఏర్పాటుకు సంకల్పించింది. అయితే ఇప్పటికే సుమారు అన్ని చెరువులకు ఎఫ్‌టీఎల్ హద్దులు ఉన్నా, రియల్టర్ల కారణం గా అవి కనుమరుగవుతున్నాయి. చెరువు శిఖంతో పాటు ఏకంగా చెరువులు, కుంటల్లో వెంచర్లు చేస్తుండడంతో వాస్తవాలు తెలియని పలువురు ప్లాట్లను కొనుగోలు చేసి నష్టపోతున్నారు. అలాగే పట్టణాల్లో మురుగు నీరు, చెత్త తదితర వ్యర్థాలను కొన్ని మునిసిపాలిటీలు చెరువుల్లో క లుపుతుండగా,మరికొన్ని ప్రాంతాల్లో స్క్రాప్, మాంస విక్ర య తదితర వ్యాపారులు, పలువురు చిరు వ్యాపారులు వ్యర్థాలను చెరువుల్లో పడవేస్తున్నారు.

దీంతో చెరువు నీరు కలుషితమవుతుండడంతో పాటు పరిసరాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. అయితే ప్రజలకు ఆహ్లాదం కల్పించేందుకు ఎంపిక చేసిన పలు చెరువులను ఇప్పటికే మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తున్నారు. భువనగిరి పెద్ద చెరువు కట్టను సుమారు రూ.10కోట్ల వ్యయంతో చేస్తున్న అభివృద్ధి చేస్తుండగా, త్వరలో ఇది పర్యాటక కేంద్రంగా మారనుంది. అలాగే యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా రాయిగిరి, గండి చెరువును కూడా ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. ఇదే తరహా చెరువుల అభివృద్ధి ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాల్లో సాగుతోంది. కానీ మెజార్టీ చెరువులు మాత్రం అభివృద్ధికి దూరంగా, కబ్జాలకు దగ్గరగా ఉన్నాయి.

48 అంశాలతో నివేదిక

పట్టణాల్లోని చెరువులను కాపాడే లక్ష్యంతో చేపట్టిన చర్యల్లో భాగంగా 48 అంశాలతో కూడిన సమగ్ర నివేదికను, చెరువుల అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికలు ఈ నెల 5వ తేదీలోగా ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్లకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. చెరువుల విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం, రికార్డులు, ఆక్రమణలు, కబ్జా స్థలాల్లో నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్ హద్దులు, వాటి నిర్వహణ తదితర అంశాలపై కమిషనర్లు నివేదిక అందజేయాల్సి ఉంది. అందుకోసం పలువురు కమిషనర్లు చెరువుల వివరాలు,సర్వే కోసం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు లేఖలు రాశారు.

చెరువుల అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికలు

చెరువుల వివరాలతో పాటు వాటి అభివృద్ధికి సూక్ష్మ ప్రణాళికలు రూపొందించి గడువులోగా కమిషనర్లు నివేదించాల్సి ఉంది. అయితే చెరువుల పునరుజ్జీవంలో భాగంగా ప్రజలు, స్వచ్ఛంద సంస్థలను, విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని మునిసిపల్‌శాఖ సంచాలకుడు ఆదేశించారు. చెరువుల్లో వ్యర్థాలను కలపకుండా నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, మురుగు నీరు చెరువుల్లోకి చేరకుండా కట్టడి చర్యలు తీసుకోవాలని, గ్రీన్ ఫినిషింగ్ కోసం వెదురు మొక్కలు పెంచాలని, కమ్యూనిటీ పోలీసింగ్, నర్సరీల అభివృద్ధితో కూడిన సూక్ష్మ ప్రణాళికలను రూపొందించాలని ఆయన ఆదేశించారు. అయితే భువనగిరిలో మురుగు నీరంతా పట్టణ శివారులోని తీనం చెరువులోకి చేరుతోంది. ఈ చెరువు అలుగు పోసినప్పుడు దిగువ భాగంలోని గొలుసుకట్టు చెరువుల్లోకి కూడా మురుగు నీరు ప్రవహిస్తోంది. ఇదే తరహా పరిస్థితి మరికొన్ని పట్టణాల్లో ఉంది. మునిసిపల్‌శాఖ చేపట్టిన చెరువుల పరిరక్షణ, సూక్ష్మ ప్రణాళికలు అమలులోకి వస్తే చెరువుల సంరక్షణతో పాటు చెరువుల్లోకి మురుగు నీటి ప్రవాహం తప్పనుంది.



సర్వే కోసం ఇరిగేషన్ శాఖకు లేఖ రాశాం

భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని మూడు చెరువులు, మూడు కుంటల సర్వే కోసం ఇరిగేషన్ శాఖకు ఇటీవల లేఖ రాశాం. సర్వేతో పాటు మరోసారి ఎఫ్‌టీఎల్ హద్దులను గుర్తించాలని కోరాం. చెరువుల విస్తీర్ణంపై రెవెన్యూశాఖ నుంచి వివరాలను సేకరిస్తున్నాం. చెరువుల పరిరక్షణకు అవసరమైన చర్యలన్నీ తీసుకుంటాం. ఇప్పటికే భువనగిరి పెద్ద చెరువు కట్టను మినీ ట్యాంక్ బండ్‌గా అభివృద్ధి చేస్తున్నాం. పట్టణంలోని చెరువులను, కుంటలను కాపాడేందుకు పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటాం.

- పి.రామాంజల్‌రెడ్డి, భువనగిరి మునిసిపల్ కమిషనర్

ఎస్జీటీల బదిలీల్లో గందరగోళం



నల్లగొండలో ఆదివారం వెబ్ సెంటర్లు బంద్ కావడంతో బదిలీ ఆప్షన్లు పెట్టేందుకు ఓ పాఠశాలలో కుస్తీపడుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల్లో గందరగోళం కొనసాగింది. ప్రధానంగా సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల్లో వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రహసనంగా మారడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భారీగా పోస్టుల సంఖ్యను తగ్గించడం, సర్వర్ డౌన్ కావడం, సైట్ ఓపెన్ కాకపోవడం, ఒక్క రోజే గడువు ఇవ్వడం, వందల కొద్దీ ఆప్షన్లు ఇవ్వాల్సి రావడంతో ఆదివారం రాత్రివరకు ఉపాధ్యాయులకు టెన్షన్ తప్పలేదు. పెద్దసంఖ్యలో ఎస్జీటీలు ఆప్షన్స్ పెట్టుకోలేకపోయామని, గడువు పొడిగించాలని డిమాండ్ చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- రాత్రికి రాత్రే తగ్గిన ఖాళీలు
- వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడంలోనూ అవస్థలు
- సర్వర్లు పనిచేయకపోవడంతో ఆందోళన
- మల్టిపుల్ ప్రమోషన్లు, పదోన్నతులు వదులుకోవడంతో ఖాళీలపై ప్రభావం
- ఆప్షన్ల గడువు పెంచాలని ఉపాధ్యాయుల డిమాండ్

ఎస్జీటీల ప్రమోషన్లతో కొన్ని పోస్టులు గందరగోళంలో పడితే, బదిలీల ప్రక్రియతో ఉపాధ్యాయులు మరింతగా ఇబ్బందిపడ్డారు. ఓ వైపు ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను ఎట్టి పరిస్థితుల్లో మూసివేసేదిలేదని, ప్రతీ పాఠశాలకు ఒక ఉపాధ్యాయ పోస్టును కచ్చితంగా ఉంచుతామని పేర్కొంటుంటే, క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా అనధికారిక రేషనలైజేషన్ చేపట్టడంతో పదుల సంఖ్యలోని స్కూళ్లలో జీరో పోస్టులు చూపించారు. బదిలీలకు ఆదివారం వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాల్సి ఉండగా, జిల్లాలో రాత్రికి రాత్రే 600 పోస్టుల వరకు ఖాళీల సంఖ్యను తగ్గించారని, ఇది ఎస్జీటీలకు తీరని అన్యాయమని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ మండలంలో 102 ఖాళీ పోస్టులు ఆదివారం ఉదయం నాటికి 62కు తగ్గాయి. వేములపల్లిలోనూ ఇదే పరిస్థితి ఉందని, అన్ని మండలాల్లో సగం వరకు ఖాళీలు చూపలేదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. దీనికి తోడు వెబ్ ఆప్షన్లకు ఒక్కరోజే గడువిచ్చారని, సర్వర్లు పనిచేయకపోవడం వంటి సమస్యతో రాత్రి వరకు ఆప్షన్లు పెట్టుకోలేకపోయామని పలువురు వాపోయారు. ఒక్క రోజు గడువు ఇవ్వడం సరికాదని, ఆన్‌లైన్ ఆప్షనే సరికాదని, ఆఫ్‌లైన్‌లో కౌన్సిలింగ్ నిర్వహిస్తే బాగుండేదని పలువురు అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్‌లోనైనా అందరికీ ఒకే రోజు కాకుండా 200 పోస్టులకు ఒక రోజు చొప్పున ఆప్షన్లు ఇచ్చేలా అవకాశమిస్తే గందరగోళానికి అవకాశం ఉండేది కాదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వెబ్ ఆప్షన్లకు మరో అవకాశం ఇవ్వాలని పలువురు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఇబ్బందిగా మారిన మల్టిపుల్ ప్రమోషన్లు

మల్టిపుల్ ప్రమోషన్ల కారణంగా ఎస్జీటీలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అర్హతల ప్రకారం ఒక్కొక్కరు రెండు,మూడు పోస్టులకు పదోన్నతి పొందారు. కానీ సదరు ఉపాధ్యాయుడు ఒక్క పోస్టులో మాత్రమే జాయిన్ అవుతారు.మిగిలిన పోస్టులు ఖాళీగా ఉంటాయి.అయితే ఈపోస్టులను ఖాళీల్లో చూపకపోవడంతో తదుపరి పదోన్నతి పొందేవారికి అవకాశంలేకుండా పోయింది. అదేసమయంలో బదిలీ కోరేవారికి ఈఖాళీ చూపకపోవడంతో అవకాశం లేకుండా పోయింది. ఉద్యోగోన్నతి పొందిన వారు జాయిన్ కాకుండా వదిలేసిన పోస్టులను వెంటనే ఖాళీల్లో చూపాలని కోరినా,ప్రభుత్వం స్పందించకపోవడంతో తమకు అన్యాయం జరుగుతోందని ఎస్జీటీలు పేర్కొంటున్నారు. ఇలా ఒక్కొక్కరికి రెండు, మూడు ప్రమోషన్లను ఇవ్వడంతో వారు జాయిన్ కాకపోవడంతో 180వరకు ఖాళీలుగా మిగిలాయి.వీటిని ఖాళీల్లో చూపకపోవడంతో ఎస్జీటీలకు బదిలీల్లో ఆప్షన్ పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది.

పదోన్నతులు వదులుకోవడంతో

పదోన్నతుల ప్రక్రియలో ఎస్జీటీలకు సీనియార్టీ ఆధారంగా ఎస్‌ఏలుగా పదోన్నతి లభించగా, కొందరు వాటిని వదులుకున్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయుల్లో కొందరు ఇంగ్లీష్ మీడియం బోధించలేమనే కారణంతో పాటు, రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉండడంతో దూరప్రాంతాలకు వెళ్లలేమని కొందరు పదోన్నతిని వ దులుకొని జీఎస్టీలుగానే కొనసాగేందుకు సిద్ధమయ్యారు. దీంతో సుమా రు 20 పోస్టుల వరకు ఖాళీలుగా మిగిలాయి. వాటిని కూడా ఖాళీల్లో చూపకపోవడంతో ఎస్జీటీలకు బదిలీల్లో ఆప్షన్ పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది.

నకిలీ సర్టిఫికెట్లతో..?

ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పలువురు పదోన్నతి కోసం ఇతర రాష్ట్రాల్లో కోర్సులు చేసినట్టు సర్టిఫికెట్లు సమర్పించారనే ఫిర్యాదులు ఉన్నాయి. ప్రధానంగా మహారాష్ట్రకు చెందిన కళాశాలల నుంచి అండర్‌గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు, అదేవిధంగా బీపీఈడీ కోర్సు పూర్తిచేసినట్టు సర్టిఫికెట్లు సమర్పించారని, వాస్తవానికి విధుల్లో ఉండి కోర్సులు ఎలా చదువుతారని, అవన్నీ నకిలీ సర్టిఫికెట్లేనని కొందరు ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వారు పట్టించుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మొత్తంగా బదిలీలు, పదోన్నతుల సందర్భంగా ఉపాధ్యాయులు కొందరు అడ్డదారుల్లో వెళ్లడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో ముసురు

- ఊపందుకున్న వ్యవసాయ పనులు
- పనుల్లో నిమగ్నమైన రైతులు



నల్లగొండ, జూన్ 30: ఉమ్మడి జిల్లాలో ఆదివారం ముసురుతో కూడిన వర్షం పడింది. కొన్ని మండలాల్లో మాత్రమే ఓ మోస్తరు వర్షం కురవగా ఇతర మండలాల్లో స్వలంగా ముసురుపడింది. జిల్లాలో సగటున 7.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మిర్యాలగూడలో 2.67సెంటీమీటర్లు, అత్యల్పంగా కేతేపల్లిలో 1.1సెంటీమీటర్ల వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం దాక ముసురు కురుస్తూనే ఉంది. జిల్లాలో అత్యధికంగా మోతెలో 4.83 సెంటీమీటర్లు, అత్యల్పంగా తిరుమలగిరిలో 0.19సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

మొత్తంగా జిల్లాలో 2.43 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. యాదాద్రి జిల్లాలో సగటున 5.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా సంస్థాన్‌నారాయణపురంలో 1.9మిల్లీమీటర్లు, అత్యల్పంగా రామన్నపేటలో 0.4మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. పలుచోట్ల నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

అర్హులకు రైతు భరోసా అందించాలన్నదే లక్ష్యం

జిల్లా వ్యవసాయశాఖాధికారి శ్రవణ్‌కుమార్



కట్టంగూరులో రైతు అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జేడీఏ శ్రవణ్‌కుమార్

కట్టంగూరు, జూన్ 30: అర్హులకు రైతు భరోసా ఇవ్వాలనే ప్రభుత్వం రైతులతో ముఖాముఖి సమావేశాలు ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కట్టంగూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదు ఎకరాలలోపు భూములు ఉన్న వారికే రైతు భరోసా ఇవ్వాలని, కంపచెట్లు, రాళ్లు ఉన్న భూములకు వద్దని పలువురు రైతులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివరాం, క్లస్టర్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్యాంకుమార్, సీఈవో మల్లారెడ్డి, రైతులు శశిపాల్‌రెడ్డి, చెరుకు నర్సింహ, మన్నెం నర్సింహ, పద్మ, లక్ష్మీనారాయణ, వెంకన్న, చంద్రయ్య, రాంబాబు, యాదగిరి పాల్గొన్నారు.

కేతేపల్లి: అర్హులకు రైతు భరోసా దక్కాలని ప్రభుత్వం క్షేత్రస్థాయిలో రైతులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు సేకరిస్తోందని నల్లగొండ డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం కేతేపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జేడీఏ శ్రవణ్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాధనం దుర్వినియోగంకాకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పి.శేఖర్, ఏవో బి.పురుషోత్తం, పీఏసీఎస్ సీఈవో వడ్డె నర్సయ్య, రైతులు ఏళ్ల అశోక్‌రెడ్డి, ఎ.కేశవరెడ్డి, బీరం జానిరెడ్డి, మేరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెంకటనర్సయాదవ్, లూర్దుమారయ్య, పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నుంచి విముక్తి

నేటి నుంచి నెల రోజులపాటు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

అందరికీ దూరమై.. వీధుల్లో తిరుగుతున్న బాలలు.. పరిశ్రమలు, దుకాణాల్లో వెట్టికి గురవుతున్న చిన్నారుల మోములో చిరునవ్వు కోసం పోలీస్‌శాఖ 'ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్' పేరుతో తనిఖీలను నిర్వహించేందుకు సిద్ధమైంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, ఇటుక బట్టీలు, ఆటో, బైక్ గ్యారేజీలను నేటి నుంచి జల్లెడ పట్టి చిన్నారులను పాఠశాలలు, పునరావాస కేంద్రాలకు తరలించనుంది.

- నల్లగొండ క్రైం

•7లో..

'రైతు భరోసా'ను జమ చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

హాలియా, జూన్ 30: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానం ప్రకారం ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదును వెంటనే జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం హాలియాలో పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సాగర్ నియోజకవర్గస్థాయి మండల కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతు భరోసాను ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.7500 వరకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. దీనిపై విధి విధానాలు ప్రకటించి వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో విత్తనాలు, ఎరువులు, కూలీలు, దక్కులు దున్నడానికి ఇతర వ్యవసాయ పనులకు రైతుల వద్ద డబ్బు లేక ఇబ్బందులు పడుతున్నారని, వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా విత్తనాలు, ఎరువులు సకాలంలో అందడం లేదన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీని వెంటనే చేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాసంపదైన బొగ్గు గనులను వేలం వేసిందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే ఈ వేలాన్ని నిలిపివేయాలని లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కూన్‌రెడ్డి నాగిరెడ్డి, సీహెచ్.లక్ష్మీనారాయణ, కొండేటి శ్రీను, అవుతా సైదయ్య, దుబ్బ రామచంద్రయ్య, ధైద శ్రీను, కత్తి శ్రీనివాస్‌రెడ్డి, వేములకొండ పుల్లయ్య, జె.రవినాయక్, పి.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ఎజెండా అమలు చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి ఆరోపించారు. ఆదివారం చిట్యాలలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గస్థాయి శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. నీట్ అవకతవకలకు కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలనీ, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ములకలపల్లి రాములు, జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, పెంజర్ల సైదులు, జిట్ట సరోజ, మల్లం మహేష్, అరూరి శ్రీను, పాముగుల్ల అచ్చాలు, శీలా రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు డీసీసీబీ నూతన చైర్మన్ ఎన్నిక

- ఉదయం 9గంటలకు ప్రారంభం కానున్న ప్రక్రియ
- చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక లాంఛనమే!



నల్లగొండ, జూన్ 30: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) నూతన చైర్మన్‌ను సోమవారం ఎన్నుకోనున్నారు. గత చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై జూన్ 28వ తేదీన ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆయన పదవిని కోల్పోయారు. మొత్తం 15మంది డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి మద్దతు పలకడం, చైర్మన్ పదవీచ్యుతుడు కావడంతో సహకారశాఖ నిబంధనల మేరకు వెనువెంటనే డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డిని తాత్కలిక చైర్మన్‌గా నియమించారు. అవిశ్వాస తీర్మాన ప్రక్రియ తరువాత మూడు రోజుల అనంతరం ఈ నెల 1వ తేదీన డీసీసీబీ నూతన చైర్మన్‌ను ఎన్నుకోవడానికి జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్ షెడ్యూల్ విడుదల చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు నూతన చైర్మన్ ఎన్నిక ప్రక్రియను అధికారులు ప్రారంభిస్తారు. షెడ్యూల్ ప్రకారం తొలుత నామినేషన్లు స్వీకరిస్తారు.

శ్రీనివాస్‌రెడ్డికే చైర్మన్ పదవి!

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సన్నిహితుడైన మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ నాయకుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి డీసీసీబీ నూతన చైర్మన్‌గా ఎన్నిక కావడం లాంఛనమే. సోమవారం ఉదయం 9గంటలకు శ్రీనివాస్‌రెడ్డి తన మద్దతుదారులతో కలిసి నామినేషన్‌ను జిల్లా సహకార అధికారికి అందజేయనున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగే ఈ ఎన్నిక ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంభం శ్రీనివాస్‌రెడ్డికి మొత్తం 15మంది డీసీసీబీ డైరెక్టర్లు మద్దతుగా ఉన్నారు. ఆయనకు పోటీగా ఎవరైనా నామినేషన్ దాఖలు చేస్తే ఓటింగ్ నిర్వహిస్తారు. ప్రస్తుతం ఎవ్వరూ నామినేషన్ దాఖలు చేసే పరిస్థితి లేదు. దీంతో నూతన చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎన్నికైనవారు డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ చేతిలో ఉన్న డీసీసీబీ కాంగ్రెస్‌కు దక్కే అవకాశం ఉంది. చైర్మన్‌గా ఎన్నికకానున్న శ్రీనివాస్‌రెడ్డిని సన్మానించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదేవిధంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హాజరుకానున్నారు.

బిల్ కలెక్టర్ల జీవితాలు దయనీయం

● ఆర్థిక ఇబ్బందులతో సతమతం ● నెలకు రూ.2వేల నుంచి రూ.3వేలు వేతనం ● తమను ఆర్టిజన్లుగా గుర్తించాలని వేడుకోలు



నల్లగొండ టౌన్, జూన్ 30: విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ బిల్‌కలెక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో పీస్ రేట్ లెక్కన ఒక్కో బిల్ కలెక్టర్ నెలకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వేతనం మాదిరి తీసుకునేవారు. మార్చి నెల నుంచి వారి ఆదాయం రెండు నుంచి రూ.3వేలు మించడం లేదు. వినియోగదారుడు డబ్బు చెల్లించిన రశీదు కట్‌చేస్తేనే(పీఆర్) వీరికి పీస్ రేట్ కింద రూ.2 ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం జీరో బిల్‌తో బిల్లులు చెల్లించే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా సుమారు 8లక్షల వరకు గృహ విద్యుత్ వినియోగదారులుండగా, వీరిలో సగానికి పైగా ఉచిత విద్యుత్ పథకానికి అర్హత సాధించి, ప్రభుత్వ సబ్సిడీ పొందుతున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే 4లక్షలకు పైగా ఉన్న విద్యుత్ వినియోగదారుల్లో సుమారు 2.40 లక్షల మందికి ఉచిత విద్యుత్ అమలవుతోంది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 135 మంది బిల్‌కలెక్టర్లు

బిల్లులను సకాలంలో వసూలు చేసేందుకు మూడు దశాబ్దాల క్రితం విద్యుత్ సంస్థలు ప్రైవేట్ బిల్‌కలెక్టర్ వ్యవస్థను తీసుకొచ్చాయి. ఇందు కోసం అవసరమున్న చోట కాంట్రాక్టు పద్ధతిలో నియామకాలు చేపట్టారు. అర్హులైన వారిని ఎంపిక చేసి వారి నుంచి సెక్యూరిటీ డిపాజిట్ కింద ఒక్కో వ్యక్తి నుంచి రూ.లక్ష వరకు బ్యాంకుల్లో డిపాజిట్ చేయించారు. అప్పటినుంచి వారికి నెలనెలా బిల్లుల వసూలు బాధ్యతలను అప్పగించి వారికి పీస్ రేటు విధానంలో కాంట్రాక్టర్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 135 మంది గడిచిన కొంతకాలంగా ఇదే సంస్థను నమ్ముకొని పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 62 మంది ఉండగా, యదాద్రి భువనగిరి జిల్లాలో 35 మంది, సూర్యాపేట జిల్లాలో 48 మంది పనిచేస్తున్నారు.

చాలీచాలని జీతాలతో అవస్థలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్‌రంగ సంస్థ(ఏపీఎస్ఈబీ) ఉన్న నాటి నుంచి బిల్ కలెక్టర్లు పనిచేస్తున్నారు. చాలీచాలని జీతాలతో నానా అవస్థలు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక రశీదు కట్ చేస్తే రూ.2.80 పైసలు చెల్లిస్తారు. అదే పట్టణ ప్రాంతంలో నైతే కేవలం రూ.2 మాత్రమే చెల్లిస్తారు. ఆ మేరకు తీసుకుంటున్న బిల్ కలెక్టర్లకు మూడు నెలలుగా కనీస వేతనం కూడా అందడం లేదు. దీంతో బిల్లు కలెక్టర్ల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. సొంతఖర్చులతో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి బిల్లులు వసూలుకు తిరిగితే నెలకు ప్రస్తుతం వారికి వచ్చే ఆదాయం రూ.2వేల నుంచి రూ.3వేలకు మించటం లేదని వాపోతున్నారు. పట్టణ ప్రాంతాల్లో వారి పరిస్థితి కూడా ఇంతకంటే కొంచెం మెరుగ్గా రూ.4వేలకు పైన వస్తున్నట్లు సమాచారం.



ఆర్టిజన్లుగా గుర్తించాలి

తెలంగాణ విద్యుత్ శాఖలో దశాబ్ద కాలంగా కాంట్రాక్టు బిల్లు కలెక్టర్లుగా పనిచేస్తున్న మమ్మల్ని ఆర్టిజన్లుగా గుర్తించాలి. సంస్థ మనుగడ కోసం పనిచేసేవారిలో ప్రథమస్థానంలో ఉండే తమ పట్ల ప్రభుత్వానికి, యాజమాన్యానికి చిన్నచూపు తగదు. ఇప్పటికైనా సంస్థ మా సేవలను గుర్తించి అన్ని విధాలా ఆదుకోవాలి. ఇంతకాలం చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమను ఇప్పుడు పంపిస్తామంటే ఎలా. ప్రభుత్వం తమ సాధకబాధకాల గురించి ఆలోచించాలి.

\- ఎస్.సైదిరెడ్డి, బిల్ కలెక్టర్, నల్లగొండ.



పరిస్థితి ఘోరంగా మారింది

బిల్‌కలెక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. గతంలో పీఆర్‌ల ద్వారా నెలకు రూ.12 వేల వరకు సంపాదించేవాళ్లం. ఇప్పుడు రెండు, మూడు వేలు రావడమే గగనమైపోయింది. కనీసం తాము ఇందులో చేరే సమయంలో సెక్యూరిటీ డిపాజిట్ కింద చెల్లించిన రూ.లక్షకు కనీసం వడ్డీ కూడా రావడం లేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.

\- రవి, బిల్‌కలెక్టర్, నల్లగొండ

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు సాగర్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం లలిత

నాగార్జునసాగర్, జూన్30: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాగర్ హిల్‌కాలనీ సెయింట్ జోసెఫ్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం లలిత, పీఈటీ కిరణ్ కుమార్ ఆదివారం తెలిపారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అండర్-8, అండర్-10, అండర్-12 విభాగాల్లో బాలబాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వివరించారు. జూలై 7వ తేదిన రంగారెడ్డి జిల్లాలో పుల్లెంల గోపిచంద్ అకాడమీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. బాలికల విభాగంలో అండర్-8 విభాగంలో 50మీటర్ల పరుగు పందెంలో యోజిత, అండర్-10 విభాగంలో 100మీటర్ల పరుగు పందెంలో గౌతమి, అండర్-12 విభాగంలో లాంగ్ జంప్‌లో షర్మిళ, దీక్షితలు, బాలుర విభాగంలో, బాలుర విభాగంలో లాంగ్‌జంప్‌లో నిఖిల్‌లు ఎంపికైనట్లు చెప్పారు.

భువనగిరిలో బైకు దగ్ధం

భువనగిరి టౌన్, జూన్ 30: యాదాద్రి భువనగిరి జిలా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిలిపి ఉన్న బైకును శనివారం రాత్రి దగ్ధం చేశారు. పట్టణ ఎస్ఐ అరుణ్ తెలిపిన వివరాల ప్రకారం... రైల్వే ఉద్యోగి భాషబోయిన రవికుమార్ శనివారం రాత్రి విధులు ముగించుకొని ఇంటి ముందు బైక్‌ను నిలిపి నిద్రించాడు. కొద్దిసేపటికి గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై పెట్రోల్ పోసి దగ్ధం చేశారు. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ.2కోట్లతో ఉడాయింపు?

● మాడ్గులపల్లిలో వృద్ధ దంపతుల మిస్సింగ్

మాడ్గులపల్లి, జూన్ 30: జిల్లాగొండ జిల్లా మాడ్గులపల్లి గ్రామపంచాయతీకి చెందిన వృద్ధ దంపతుల మిస్సింగ్‌పై కేసు నమోదైంది. ఈ నెల 17 నుంచి వృద్ధ దంపతులు గ్రామంలో కనిపించకుండాపోవడంతో కుటుంబసభ్యులు ఈ విషయంపై మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బంధువులకు వృద్ధ దంపతుల గురించి సమాచారం ఇచ్చినా తమ దగ్గరికి రాలేదని చెప్పారు. వృద్ధ దంపతులు గ్రామంలోని చుట్టుపక్కల వారితోపాటు తెలిసినవారి నుంచి కొంత నగదును అప్పుగా తీసుకోని సకాలంలో వడ్డీసహా చెల్లించేవారు. ఇలా నమ్మకం ఏర్పడడంతో గ్రామంలోని సుమారు 75 మంది నుంచి సుమారు రూ.2కోట్లు అప్పుగా తీసుకున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు ఇంటికెళ్లి చూసినా ఫలితం లేకపోవడంతో చేసేదేమీ లేక ఈ విషయంపై మాడ్గులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

గ్యాస్ లీకేజీతో ముగ్గురికి అస్వస్థత



పరిశ్రమను పరిశీలిస్తున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 30: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని నారాయణగిరి శివారులోని సాయితేజ డ్రగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఆదివారం గ్యాస్ లీక్ అయింది. ఈ ఘటనలో కార్మికులు మున్నాలాల్, పరమేశ్వర్, దేవశారన్‌లు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇందులో మున్నాలాల్‌కు ఊపిరి ఆడక తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో అబ్దుల్లాపూర్ మెట్‌లోని 108 వైద్య సిబ్బంది పీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. మెరుగైన వైద్యం కోసం వనస్థలిపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ భాస్కర్‌రెడ్డి పరిశ్రమను పరిశీలించారు.

ఢిల్లీ పర్యటనలో ఉత్తమ్, పద్మావతి

● మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో దేశ రాజధానికి
● ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన ఉత్తమ్ దంపతులు



ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉత్తమ్ దంపతులు

హుజూర్‌నగర్, జూన్ 30: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ఏఐసీసీ నేతగా సెంట్రల్ స్ర్కీనింగ్ కమిటీ సభ్యులైన మంత్రి ఉత్తమ్, ఆయన సతీమణి పద్మావతిలు ఢిల్లీ టూర్ కీలకంగా మారింది. గతంలో ఎప్పుడూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక్కరే ఏఐసీసీ నేతలను కలిసేవారు. కానీ గత కొద్దిరోజులుగా ఉత్తమ్‌తోపాటు పద్మావతిరెడ్డి కూడా ఢిల్లీ టూర్‌లో ఉండడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే మంత్రి ఉత్తమ్ ఏఐసీసీ నేత సోనియాగాంధీని కలిశారు. అనంతరం ఆదివారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి దంపతులు ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాల గురించి చర్చించారు. మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో ఢిల్లీలో గత నాలుగు రోజులుగా ఉన్న ఉత్తమ్, పద్మావతి దంపతులు ఖర్గేను కలవడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా కోటాలో తనకు మంత్రి పదవి కేటాయించాలని ఉత్తమ్ సతీమణి పద్మావతిరెడ్డి ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఈ నేపథ్యంలో పద్మావతిరెడ్డి మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు.

రూ.10వేల విలువైన గుట్కాల పట్టివేత

భువనగిరి టౌన్, జూన్ 30: యాదాద్రి భువనగిరి కేంద్రం జిల్లా ఆసుపత్రి సమీపంలోని వీరభద్ర జనరల్ స్టోర్స్‌లో ఆదివారం రూ.10వేల విలువైన గుట్కాలను పట్టుకున్నారు. నిషేదిత గుట్కా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పట్టణ ఎస్ఐ అరుణ్ నేతృత్వంలో పోలీసులు తనిఖీ చేయగా, విక్రయానికి సిద్ధంగా ఉంచిన గుట్కా ప్యాకెట్లు వెలుగుచూశాయి. దీంతో గుట్కాలను స్వాధీనం చేసుకొని దుకాణం నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుట్టపై ఎలక్ట్రిక్ వాహనాల కొరత

● మరమ్మతులకు మూడు వాహనాలు ● రద్దీ రోజుల్లో ఇబ్బందే..?



కొండపై వృద్ధులను తరలిస్తున్న ఎలక్ట్రిక్ వాహనం

భువనగిరి అర్బన్, జూన్ 30: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు కూడా ఉండగా వీరికోసం స్టేట్ బ్యాంక్ సహకారంతో మూడు ఎలక్ట్రిక్ వాహనాలు, సెంట్రల్ బ్యాంకు సహాయంతో మరో రెండు వాహనాలు సమకూరాయి. వీటి ద్వారా బ్రేక్ టికెట్లు ఇచ్చే ప్రదేశం నుంచి ఆలయ ఉత్తర భాగంలోని గేట్ వద్దకు వృద్ధులు, దివ్యాంగులు, చిన్న పిల్లలను తరలిస్తుంటారు. కాగా, ప్రస్తుతం ఇక్కడి ఘాట్ రోడ్డు ఎక్కేందుకు ఈ వాహనాల సేవలకు ఆటంకం ఏర్పడటంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2023 జూన్ 5న ఎస్‌బీఐ ఆధ్వర్యంలో అయాన్ బ్యాటరీతో కూడిన మూడు వాహనాలు దేవస్థానానికి అందజేశారు. ప్రారంభంలో వీటి ద్వారా సాఫీగా సేవలందగా కాలక్రమేణ వాటికి బిగించిన బ్యాటరీల సామర్థ్యం తగ్గి ఘాట్ రోడ్డు ఎక్కలేక మొరాయించాయి. ఇక్కడ అవి నిరుపయోగంగా మారడంతో 2023 డిసెంబరు 12న మరమ్మతులకోసం ఆలయ అధికారుల సమాచారం మేరకు బ్యాంకు అధికారులు హైదరాబాద్‌కు తరలించారు.

అందుబాటులోకి మరో రెండు వాహనాలు

2023 డిసెంబరు 8న సెంట్రల్ బ్యాంకు సహకారంతో మరో రెండు బ్యాటరీ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి సెంట్రల్ బ్యాంకుకు చెందిన రెండు వాహనాల ద్వారానే భక్తులను తరలిస్తున్నారు. వీటిలో ముఖ్యంగా నాసిరకం బ్యాటరీలతో ఘాట్ రోడ్డు ఎక్కలేకపోతుండగా వాహనాలకు బిగించిన అయాన్ బ్యాటరీకి బదులు లిథియం అయాన్ బ్యాటరీలను సమకూర్చాలని ఇటీవల దేవస్థానం ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు బ్యాంకు అధికారులను కోరినట్లు తెలిపారు. మరమ్మతులకు వెళ్లిన వాహనాలకు లిథియం అయాన్ బ్యాటరీలు బిగిస్తే యథావిధిగా భక్తులను వాహనాల్లో తరలించేందుకు అందుబాటులోకి రానున్నాయి.

నాసిరకం బ్యాటరీలతోనే మొరాయిస్తున్నాయి

ఎస్‌బీఐకి చెందిన ఎలక్ట్రికల్ వాహనాలు నాసిరకం బ్యాటరీలతో ఘాట్ రోడ్డు ఎక్కలేక మొరాయిస్తున్నాయి. అయాన్ బ్యాటరీలకు బదులు లిథియం అయాన్ బ్యాటరీలు బిగించాలి. వాటికోసం బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చాం. త్వరలో ఐదు వాహనాలను అందుబాటులోకి తెస్తాం.

● ఊడెపు వెంకటరామరావు, ఈఈ, దేవస్థానం ఎలక్ట్రికల్ విభాగం

వెట్టిచాకిరి నుంచి విముక్తి

తల్లిదండ్రులకు దూరమైన వీధి బాలల మోముల్లో చిరునవ్వు కోసం పోలీస్ శాఖ 'ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్' పేరుతో తనిఖీలను వేగవంతం చేసేందుకు సిద్ధమైంది. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, ఇటుక బట్టీలు, ఆటో, బైక్ గ్యారేజీలను నేటి నుంచి జల్లెడ పట్టనుంది. తప్పిపోయిన బాలబాలికలు, అనాథ పిల్లలను, వెట్టి చాకిరీ చేస్తున్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి వారికి అప్పగించడంతోపాటు అనాథ చిన్నారులను పునరావాస కేంద్రాలకు తరలించి వారికి మంచి జీవితాలను కల్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయనుంది.

- నల్లగొండ క్రైం



బాల కార్మికులను గుర్తించి అవగాహన కల్పిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ టీమ్ (ఫైల్)

- నెల రోజులపాటు జిల్లాలో బాల కార్మికుల కోసం తనిఖీలు
- జిల్లాలో సబ్ డివిజన్‌వారీగా రంగంలోకి మూడు టీమ్‌లు
- వీధి బాలలు, బాలకార్మికులకు విముక్తి కల్పించనున్న పోలీసులు
- ఇప్పటివరకూ సుమారు 1,450 మంది బాలకార్మికులకు విముక్తి

జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్-10 కార్యక్రమం నిర్వహించేందుకు పోలీస్‌శాఖ అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తుంది. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందిని కలిపి ముస్కాన్‌లో భాగంగా మూడు టీమ్‌లను ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా బాల కార్మికులను గుర్తించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి వారికి విముక్తి కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా బాల కార్మికులు ఎక్కడైనా పనిచేస్తున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయిని, ప్రతీ కార్యక్రమంలో బాలకార్మికులు, వీధి బాలలను గుర్తిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతీ ఏడాది రెండుసార్లు

బాల కార్మికులు, వీధి బాలలకోసం ప్రతీ సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు రెండు సార్లు తనిఖీలు నిర్వహిస్తుంటారు. ప్రతీ ఏడాది ప్రారంభంలో జనవరి 1 నుంచి 31 వరకూ ఆపరేషన్ స్మైల్ పేరుతో, జూలై 1 నుంచి 31 వరకూ ఆపరేషన్ ముస్కాన్ పేరుతో బాలకార్మికుల కోసం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ రెండు నెలల్లో ప్రతిరోజూ జిల్లా యంత్రాంగం డివిజన్‌కు ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన మూడు టీమ్‌లు ఆయా డివిజన్లలో విస్తృత తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి వారికి బంగారు జీవితం ఇచ్చే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. జిల్లా టీమ్‌తోపాటు ప్రతీ డివిజన్, మండల కేంద్రాల్లో సైతం ఈ టీమ్‌లతోపాటు స్థానిక టీమ్‌లు పోలీసుల సహకారంతో తనిఖీలు నిర్వహించనున్నారు. పోలీస్ విభాగానికి చెందిన ఎస్ఐ స్థాయి అధికారి ఈ టీమ్‌కు ఇన్‌చార్జిగా ఉండి పోలీస్, ఐసీడీఎస్, కార్మిక, చైల్డ్ కేర్, విద్యాశాఖ, రెవెన్యూ, హెల్త్, జిల్లా యంత్రానికి చెందిన, బాలల రక్షణ స్వచ్ఛంద సంస్థల వారు ఈ టీములలో సభ్యులుగా ఉండి ఈ నెల రోజులు బాలకార్మికులను గుర్తించి విముక్తి చేసే పనిలోనే ఉంటారు. బాలల భద్రతకు ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ భరోసాగా నిలుస్తున్నాయి.

సుమారు 1,450 మంది చిన్నారులకు విముక్తి

గత తొమ్మిదేళ్లుగా ఎంతో మంది చిన్నారులకు విముక్తి కల్పిస్తున్నారు, ప్రతీ ఏడాది రెండు సార్లు నిర్వహించే ఈ ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ ద్వారా జిల్లావ్యాప్తంగా సుమారు 1,450 మంది చిన్నారులకు విముక్తి లభించింది. చిన్నారులను వెట్టి చాకిరీ చేయించడంతోపాటు పనుల్లో పెట్టుకుంటున్న యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశారు. గతేడాది జూలైలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో 85 బాలకార్మికులను గుర్తించి 80క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అదే విధంగా ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో 59 చిన్నారులను గుర్తించి పోలీసులు 49



క్రిమినల్ కేసులను నమోదు చేశారు. మొత్తం సుమారు 1,450 మంది బాల కార్మికులను గుర్తించిన ఈ టీమ్‌లు 1000కి పైగా యాజమాన్యాలపై క్రిమినల్ కేసులను నమోదు చేశాయి. తొమ్మిదేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా ఎక్కువగా బాల కార్మికులను గుర్తించారు. హోటళ్లు, ఇటుక బట్టీలు, బేకరీలు, దాబాలు, నీటి సరఫరా, మెకానిక్ గ్యారేజీలలో పనిచేసే వారుగా గుర్తించగా ఈ చిన్నారులు ఎక్కువగా బీహార్, ఒడిశా, రాజస్థాన్, యూపీకి చెందిన వారే ఉన్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమాల ద్వారా ఎంతో మంది చిన్నారు లు అమ్మ ఒడికి చేరడంతోపాటు పునరావాస కేంద్రాలకు వెళ్లి సంక్షే మ శాఖ ఆధ్వర్యంలో అందించే విద్య ను నేర్చుకుంటున్నారు. ఈ నెలరోజులపాటు కూడా ఈ టీమ్‌లు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను, వీధి బాలలను గుర్తించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

చిన్నారులతో వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు

- శరత్‌చంద్ర పవార్, నల్లగొండ ఎస్పీ

జిల్లావ్యాప్తంగా జూలై నెల మొత్తం ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నాం. బాల కార్మికులు, వీధి బాలలతో వెట్టి చాకిరీ చే యిస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవు. ప్రతి ఏడాది జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్‌ను ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహించి జిల్లాలో బాల కార్మికులను గుర్తిస్తాం. ముఖ్యంగా ఇటుక బట్టీలు, హోటళ్లు, మెకానిక్ షాపులతో పాటు బేకరీలలో కూడా బాల కార్మికులతో పని చేయించవద్దు. అలాంటి వారిని గుర్తించి కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకూ 9 చొప్పున ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. జూలై 1 నుంచి 31 వరకూ ఆపరేషన్ ముస్కాన్ 10 నిర్వహిస్తున్నాం. ముస్కాన్ టీమ్‌లో ఐదు శాఖలను సమన్వయం చేస్తూ టీమ్‌గా ఏర్పాటు చేసి బాల కార్మికుల నిర్మూలను కృషి చేస్తున్నాం. చిన్నారులను పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయి.



యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

● యాదగిరి క్షేత్రంలో భక్తుల కోలాహలం ● వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం ● రద్దీగా ఆలయ తిరువీధులు, వ్రత మండపాలు







యాదగిరిగుట్ట ప్రధాన ఆలయంలో ప్రత్యేక అలంకారంలో ఉత్సవమూర్తులు, నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు, కొండపై వాహనాల రద్దీ

భువనగిరి అర్బన్, జూన్ 30: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం సుప్రభాత సేవతో స్వామి, అమ్మవారలను మేల్కొల్పిన అర్చకులు సంప్రదాయరీతిలో నిత్యపూజలు నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణపర్వాలు వైభవంగా చేపట్టారు. అనుబంధంగా కొనసాగుతున్న పాతగుట్ట స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు ఘనంగా నిర్వహించారు. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో జరిపారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వారబంధనం చేశారు.

కొండపై భక్తుల సందడి

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవురోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 30వేల మంది భక్తులు తరలివచ్చారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఉభయ క్యూలైన్లు, వ్రత మండపాలు, ఆలయ తిరువీధుల్లో రద్దీ నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో ఏర్పాటు చేసిన షెడ్డు కింద, మెట్లమార్గంలో భక్తులు అధిక సంఖ్యలో సేదతీరారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.45,08,650 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ప్రసాదాల కౌంటర్‌లో టికెట్లు రీసైక్లింగ్ జరుగుతున్నట్లు ఆదివారం ఓ భక్తుడు ఆరోపించడంతో విచారణ చేపట్టారు.

షెడ్డు నిర్మాణానికి మొక్కల తొలగింపు

కొండపైన రథశాల ముందు నుంచి భక్తుల సౌకర్యార్థం షెడ్డు నిర్మించేందుకు దారిలోని నాలుగు మొక్కలను తొలగించారు. రథశాల నుంచి దీపారాధన ప్రాంతం వరకు షెడ్డు అందుబాటులోకి రానున్నట్లు సివిల్ విభాగం ఈఈ దయాకర్‌రెడ్డి తెలిపారు. ఉత్తర దిశలోని భారీ షెడ్డు ఆలయ సహజత్వానికి అడ్డుగా ఉండటంతో రిటైనింగ్ వాల్ పక్క నుంచి ప్రత్యేకంగా ఇంకో షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి

నకిరేకల్, జూన్ 30: నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని సుందరయ్య నగర్‌లో నివాసం ఉంటున్న వలస కార్మికుడు ఆదివారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌కు చెందిన నిషాథ్ చంద్రశేఖర్ (34), ఆయన సోదరుడు సుమిత్‌తో కలిసి ఇటీవల నకిరేకల్‌లో పెయింటింగ్ పనుల కోసం వలస వచ్చాడు. సుందరయ్య నగర్‌లోని కందాళ భద్రారెడ్డికి చెందిన రేకులషెడ్డులో అద్దెకు ఉంటున్నారు. చంద్రశేఖర్ ఆదివారం రోజువారీ కార్యక్రమంలో భాగంగా పనికి వెళ్లి వారు ఉండే గదికి వచ్చాడు. రాత్రి దుస్తులు ఉతికి దండెం తీగపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చంద్రశేఖర్ మృతి చెందాడు.

చికిత్స పొందుతూ..

చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో చికిత్స పొందుతూ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. చింతపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన బొమ్మిరిశెట్టి నాగేశ్వర్, భార్య జ్యోతి, కుమారుడు సోమేశ్వర్, కుమార్తె సోని కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. 28న పెద్దవూర మండలం అనుమల గ్రామపరిధిలోని కొట్టాల గ్రామం వెళ్లి బైక్‌పై హైదరాబాద్ నుంచి వస్తుండగా అదుపు తప్పి కుర్మేడ్ గేట్ సమీపంలో కిందపడ్డారు. స్థానికులు గమనించి చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందారని వైద్యులు తెలిపారు. నాగేశ్వర్ కుమారుడు సోమేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్‌నేతకు గాయాలు

కోదాడ రూరల్, జూన్ 30: మండలంలోని దోరకుంట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు దాసరి వీరబాబు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. శనివారం రాత్రి కోదాడ వెళ్లి తిరిగి బైక్‌పై ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న వీరబాబును పార్టీ నేతలు పలువురు పరామర్శించారు.

భువనగిరిలో ముమ్మరంగా ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాట్లు



ప్రారంభం కానున్న ప్రభుత్వ వైద్య కళాశాల

భువనగిరి టౌన్, జూన్ 30: యాదాద్రి భువనగిరి జిల్లాకు మంజూరైన ప్రభు త్వ వైద్య కళాశాలను ఈ విద్యాసంవత్సరం నుంచే ప్రారంభించేందుకు అధికారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. త్వరలో నిర్వహించనున్న నీట్ కౌన్సిలింగ్ ద్వారా కళాశాలకు మంజూరైన 50 మెడికల్ సీట్లను భర్తీ చేస్తారు. భువనగిరి పట్టణ శివారులోని పగిడిపల్లిలోని పాత కలెక్టరేట్‌లో వైద్యకళాశాల, హాస్టల్ ఏర్పాటు చేయనుండగా భువనగిరిలోని జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా వైద్య కళాశాలకు అనుసంధానం చేశారు. కళాశాల అనుమతుల ప్రక్రియలో కీలకమైన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఇటీవల భువనగిరిలో పర్యటించగా త్వరలోనే మరో రెండు, మూడుసార్లు రానున్నట్లు తెలుస్తోంది. ఎన్ఎంసీ తుది తనిఖీల నాటికి అవసరమైన నియామకాలు, వసతుల కల్పన, డాక్యుమెంటేషన్ పూర్తిచేసేందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నా నాయక్ ఆధ్వర్యంలో ప్రయత్నాలు సాగుతున్నాయి. కాగా ఈపాటికే నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ వైద్యకళాశాలలు ఏర్పాటుకాగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో దశాబ్దం నుంచే ప్రైవేట్ మెడికల్ కళాశాల కొనసాగుతోంది. తాజాగా భువనగిరిలో కూడా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభం కానుండడంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు ఎంబీబీఎస్‌లో సీట్లు లభించే అవకాశాలు మెరుగయ్యాయి. అదే సమయంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందే అవకాశాలు పెరిగాయి. అలాగే స్థానికులకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనున్నాయి.

సఖి కేంద్రానికి మతిస్థిమితం లేని యువతి

నల్లగొండ క్రైం, జూన్ 30: నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్‌రోడ్‌లో ఉన్న శ్రీనగర్‌కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువతిని పోలీసులు జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రానికి తరలించారు. రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీనగర్ కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువతిని గమనించిన యువకులు స్థానిక కౌన్సిలర్‌తోపాటు నల్లగొండ టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ ఎస్ఐ రావుల నాగరాజు వెంటనే విధుల్లో ఉన్న పెట్రోలింగ్ వాహనాన్ని ఘటనా స్థలానికి పంపారు. అప్పటికే ఆ యువతికి మతిస్థిమితం లేకపోవడంతో స్వస్థలంతోపాటు ఇతర వివరాలను వెల్లడించడంలో తడబడుతుండడంతో అదే ప్రాంతానికి చెందిన యువకులు తమ బైక్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తుండగా ఫ్లైఓవర్ మధ్యకు వచ్చేసరికి ఆబైక్ వెనకాలనుంచి కొంతమంది ఫాలో అయినట్లు తెలిసింది. అప్పటికే ఘటన స్థలానికి వస్తున్న పోలీసులను గమనించిన యువకులు వెంటనే ఆ యువతని ఫ్లైఓవర్ మధ్యలోనే ఆపి పోలీసులకు అప్పగించడతో వారు నల్లగొండ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వెళ్లి వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నించగా యువతి తగిన సమాచారం చెప్పలేదు. నల్లగొండ టూ టౌన్ ఎస్ఐ నాగరాజు ఆదేశాల మేరకు యువతని ఈ రాత్రి వరకు జిల్లా కేంద్రంలోని సఖీ సెంటర్‌కు తరలించారు. యువతి విజయవాడ నుంచి రైలులో నల్లగొండ వచ్చినట్లు చెబుతుండే తప్ప పూర్తి వివరాలు వెల్లడించడంలేదు. ఆ యువతీ నిజంగా మతిస్థిమితం లేని యువతేనా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. స్థానిక యువకులు బైక్‌పై పోలీసులకు అప్పగించేందుకు తీసుకెళుతున్న క్రమంలో వెనకాల నుంచి కొంతమంది వెంబడించడం వెనుక పలు అనుమానాలు ఉన్నట్లు పోలీస్ వర్గాల సమాచారం.

ప్రజాధనం వృథా

● గన్నీబ్యాగ్‌ల రికవరీ ● రైస్‌మిల్లుల్లో పేరుకుపోతున్న ఖాళీ బస్తాలు

మిర్యాలగూడ, జూన్ 30: మిల్లర్ల నుంచి ప్రతీ సీజన్‌లో బస్తాలను రికవరీ చేయాల్సిన అధికారులు పట్టించుకోక పోవడంతో ఏటా రూ.కోట్లలో ప్రజాధనం వృథాగా మారుతోంది. ఖాళీ గన్నీబ్యాగ్‌లను నిల్వ చేయలేక రైసు మిల్లర్లు సతమవుతుండగా అధికారులు వాటిని రికవరీ చేయకపోవడంతో ప్రతీ సీజన్‌లో కోట్ల రూపాయలు వెచ్చించి కొత్త సంచులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఉత్త సంచులది ఏముందిలే అని అధికారులు నిర్లక్ష్యం వహించడంవల్ల నిల్వ ఉంచిన గన్నీ బ్యాగులు చెదలు పట్టి పెద్ద చెత్తలా తయారవుతోందని మిల్లర్లు వాపోతున్నారు. పంటల నూర్పిడి సమయంలో మిల్లుల్లో ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. గత నాలుగేండ్లుగా గన్నీబ్యాగ్స్‌ను మిల్లర్ల నుంచి తిరిగి తీసుకోకపోవడంతో లక్షల సంఖ్యలో ఖాళీ బస్తాలు పేరుకపోయాయని పేర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇటు ప్రభుత్వం, అటు మిల్లర్లు తీవ్రంగా ఆర్థిక నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందన్న ఆరోపణలున్నాయి.



ఏళ్లతరబడి నిల్వ ఉండటంతో చెదలుపట్టి చినిగిపోతున్న బస్తాలు

సీఎంఆర్ మిల్లుల్లో పేరుకపోతున్న సంచులు

ఐకేపీ కేంద్రాల నుంచి మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు దిగుమతి తర్వాత సివిల్ సప్లయ్ అధికారులు రికవరీ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతీ ఏటా ధాన్యాన్ని రైస్‌గా మార్చేందుకు ప్రభుత్వం కొన్ని మిల్లులను ఎంపిక చేసి ఐకేపీ కేంద్రాల్లోని రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయిస్తుంది. మిల్లర్లు నిర్ణీత గడువులోగా ధాన్యాన్ని రైసుగామార్చి ఎఫ్‌సీఐకి, సివిల్‌సప్లయ్ శాఖ గోదాములకు తరలిస్తారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ క్వింటా ధాన్యానికి 67 కిలోల బియ్యం మిల్లర్లు ఇవ్వాల్సి ఉంది. 40 కిలోల చొప్పున క్వింటాకు మూడు గోనె సంచులు మిల్లులకు చేరుతాయి. కాగా గత నాలుగేళ్లుగా మిల్లర్ల నుంచి జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు రైసుమిల్లుల నుంచి ఖాళీసంచులు వెనక్కి తీసుకోకపోవడంతో వేల కొద్ది బస్తాలు మిల్లుల్లో, గోదాముల్లో నిల్వ చేయలేక, వాటిని రక్షించలేక ఇబ్బందులు పడుతున్నట్లు మిల్లర్లు వాపోతున్నారు. ఖాళీబస్తాలు రికవరీ లేక పంట సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవడానికి మిల్లుల్లో స్థలం కొరత ఏర్పడుతుందని ఆరోపిస్తున్నారు.

ఐకేపీలలో బ్యాగుల కొరత

ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేందుకు పంట సీజన్లలో ఐకేపీ కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. సకాలంలో గోనె సంచులు ఐకేపీ కేంద్రాలకు చేరక కాంటాలు ఆలస్యమై అనేక సార్లు అకాల వర్షాలకు ధాన్యం రాశులు తడిసి రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఏటా కొత్త సంచులు కొనుగోలు చేయాలంటే గన్ని బ్యాగుకు రూ. 70 నుంచి 80 రూపాయల వరకు ఖర్చవుతుంది. మిల్లర్ల వద్ద ఖాళీ గన్ని బ్యాగ్‌లు రికవరీ చేస్తే సంచుల కొరత తప్పుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. టెండర్ల ద్వారా కొనుగోలు చేసిన పాత బస్తాలు మిల్లుల్లో నిల్వ ఉండటంతో మిల్లర్ల వద్ద నుంచి బస్తాకు, 16-20 వరకు అధికారులు వసూలు చేస్తారని ఏళ్ల తరబడి బస్తాలను అధికారులు తీసుకోకపోవడంతో స్టోరేజీలోనే నగం వరకు దెబ్బతింటున్నాయని రైసుమిల్లుల యజమానులు వాపోతున్నారు.

గత సీజన్‌లో మూడు లక్షల మెట్రిక్ టన్నులు సీఎంఆర్

నల్లగొండ జిల్లాలో 2023 వానాకాలంలో మూడు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సీఎంఆర్‌కు కేటాయించారు. ధాన్యాన్ని మరాడించి బియ్యంగా మార్చినందుకు ప్రభుత్వం క్వింటా పచ్చి ధాన్యానికి రూ.10, బాయిల్డ్ రైస్‌కు రూ.15 చొప్పున చెల్లిస్తోంది. గత నాలుగేళ్లలో 14 లక్షల నుంచి 16 లక్షల మెట్రిక్ టన్నుల వరకు సీఎంఆర్‌కు కేటాయించడం జరిగింది. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యానికి గాను 9 లక్షల సంచులు అవసరమవుతాయి. గన్నీ బ్యాగుల రికవరీలో అధికారుల అలసత్వం కారణంగా ప్రభుత్వానికి ఏటా కోట్లలో ఆర్థిక నష్టం వాటిల్లుతోందని వ్యాపార వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి.

మిల్లర్లకు ఆర్థికంగా నష్టం

గోనె సంచులు గతనాలుగైదు ఏండ్లుగా అధికారులు రికవరీ చేయలేదు. ఒక్కో బస్తాకు రూ. 22 వరకు ధర చెల్లించమంటారు. మిల్లుల్లో స్టోరేజీ లేక ధాన్యం నిలువ చేయలేక పోతుండగా పాత బస్తాలకు కూడా అధిక ధర చెల్లించి మిల్లర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.

● గౌరు శ్రీనివాస్, మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు



రెండేళ్లకోసారి రికవరీ చేస్తున్నాం

సీఎంఆర్ పూర్తి చేయడానికి కొంత సమయం పడుతున్నందున్న మిల్లర్ల వద్ద బ్యాగుల రికవరీకి సమయం ఎక్కువ పడుతుంది. రెండేళ్ల కోసారి రికవరీ చేస్తాం

నాగేశ్వరరావు, జిల్లా సివిల్‌సప్లయ్ మేనేజర్

విషాదంగా మారిన ప్రేమ వివాహం

● దాడి చేసి కుమార్తెను బలవంతంగా తీసుకువెళ్లిన తల్లిదండ్రులు ● మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

సూర్యాపేట క్రైం, జూన్ 30: పీజీ చదివించడానికి కుమార్తెను పట్టణానికి పంపారు. ఆమె బాగా చదువుకుంటోందని తల్లిదండ్రులు నమ్మారు. ఆమె ఓ యువకుడి ప్రేమలో పడి పెళ్లి చేసుకుంది. తల్లిదండ్రులకు తెలియకుండా కాపురం కూడా పెట్టింది. చివరకు విషయం తెలుసుకున్న యువతి తల్లిదండ్రులు యువకుడి ఇంటిపై దాడి చేసి కుమార్తెను బలవంతంగా తీసుకువెళ్లారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన సూదగాని సురేందర్(26)పదో తరగతి చదివి సూర్యాపేటలోని రెడ్డి ఐస్ హబ్‌లో స్వీట్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన వీరబోయిన నవ్య వరంగల్‌లో పీజీ చదువుతూ అక్కడే ఓ హాస్టల్‌లో ఉంటోంది. నవ్య తల్లిదండ్రులు పదేళ్ల క్రితం తిమ్మాపురం గ్రామం నుంచి హైదరాబాద్ వలస వెళ్లారు. గ్రామంలో సమీపంలోనే సురేందర్, నవ్య ఇళ్లు ఉండటంతో పరిచయం ఏర్పడి ఏడాది నుంచి ప్రేమించుకుంటున్నారు. ఐదు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న సురేందర్, నవ్యలు మూడు నెలల క్రితం సూర్యాపేటలోని జమ్మిగడ్డలో ఇంటిని అద్దెకు తీసుకుని నివసిస్తున్నారు. స్థానికుల ద్వారా జూన్ 27వ తేదీన నవ్య తల్లిదండ్రులకు ఈ విషయం తెలిసింది. ప్రేమ వివాహం ఇష్టంలేని యువతి తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడంలేదని చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చివ్వెంల పోలీసులు నవ్యను ఈ నెల 28వ తేదీన పోలీస్‌స్టేషన్‌కు పిలిపించగా తాను సురేందర్‌ను వివాహం చేసుకున్నానని, ఇద్దరం మేజర్లమని తెలిపింది. అనంతరం సురేందర్, నవ్యలు స్వగ్రామం తిమ్మాపురం వెళ్లారు. అదే రోజు నవ్య తల్లిదండ్రులు వీరబోయిన మల్లయ్య, లక్ష్మమ్మతో పాటు కొంతమంది సమీప బంధువులు కలిసి తిమ్మాపురంలోని సురేందర్ ఇంటికి వెళ్లి తల్లి రాములమ్మపై దాడి చేసి నవ్యను బలవంతంగా హైదరాబాద్‌కు తీసుకువెళ్లారు. ఈ విషయమై సురేందర్ కుటుంబ సభ్యులు చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత నవ్య మేనమామ క్యాసారం గ్రామానికి చెందిన మింతబోయిన వెంకన్న సురేందర్‌కు ఫోన్ చేసి చంపుతామని బెదిరించారు. దీంతో మనస్తాపం చెందిన సురేందర్ ఆదివారం ఉదయం తిమ్మాపురం గ్రామం నుంచి సూర్యాపేట జమ్మిగడ్డలో అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు సురేందర్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సురేందర్ తండ్రి సైదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సురేందర్(ఫైల్)

వైభవంగా పట్టాభిరామయ్య కల్యాణం


పట్టాభి రాముని కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నార్కట్‌పల్లి, జూన్ 30: మండలంలోని మాండ్ర సరిహద్దులోని అనంత స్వర్ణగిరి పై ఉన్న పట్టాభి సీతారామచంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యాజ్ఞికులు వంశీకృష్ణమాచార్యులు, సహార్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పట్టాభి సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై జగదభిరాముడి కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. అనంతరం విద్యార్థినులతో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం స్వామివారికి బలిహరణ, రథయాత్ర నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఆలయ నిర్మాణదాత ఉంద్ర భాగ్యమ్మాలింగారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నులపండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్‌లీడర్ శోభారాణిపీవిరెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 30: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. జడ్పీటీసీ, కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్‌లీడర్ అలుగుబెల్లి శోభారాణిపీవిరెడ్డి దంపతులు, వేదపండితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య జరిపించారు. మండలకేంద్రంలో బొడ్రాయి వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సోమవారం బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామస్థులు డప్పుచప్పుళ్లతో బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారని అర్చకులు తెలిపారు.

కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నూనె రామస్వామి

దేవరకొండ, జూన్ 30: అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ చట్టాలను రూపొందించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన లంబాడీ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 50 సంవత్సరాలు నిండిన హమాలీ కార్మికులకు పింఛన్ సౌకర్యం, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, పిల్లలకు ఉచిత విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కార్మికుల పక్షాన పోరాడుతుందన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు జూలూరి వెంకట్రాములు, తిరుపతయ్య, ధనునాయక్, వెంకట్రాములు, శ్రీను పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి


ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ రూరల్, జూన్ 30: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను కలిగి ఉండాలని, ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి, పర్వతవర్ధిని సమేత శ్రీ అగస్తేశ్వరస్వామి దేవస్థాన సప్తమ వార్షిక కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, నాయకులు పాదూరి సంజీవరెడ్డి, దుండిగాల యాదమ్మశ్రీనివాస్, జెట్టి లింగయ్య, చిమట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గోర్ బంజారా జాతీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

దేవరకొండ, జూన్ 30: హైదరాబాద్ రవీంద్రభారతిలో సోమవారం జరగనున్న బోర్ బంజారా ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి, దేవరకొండ బంజారా సేవాసంఘం నాయకులు కోరారు. సమ్మేళనంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వారి హక్కుల కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే గోర్ బంజారా సమ్మేళనానికి అన్ని పార్టీ అగ్రనేతలు హాజరు కానున్నందున గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బాలునాయక్‌ను కలిసి బోర్‌బంజారా జాతీయ సమ్మేళనానికి ఆహ్వానించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం, లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు పాపనాయక్, బాబురాంనాయక్, నాగేశ్వర్‌నాయక్, రాంసింగ్, లక్‌పతినాయక్, రమేష్, గణేష్, మకట్‌లాల్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): బోర్ బంజారా జాతీయ సమ్మేళనానికి లంబాడీలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ కోకన్వీనర్ సక్రు నాయక్, ధరావత్ హరినాయక్ పిలుపునిచ్చారు.

విశ్వబ్రాహ్మణుల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలి

మిర్యాలగూడ టౌన్, జూన్ 30: విశ్వబ్రాహ్మణుల జీవన ప్రమాణాలు మెరుగుపరచాలని వనపర్తి జిల్లా డిప్యూటీ కలెక్టర్ చొల్లేటి వెంకటేశ్వర్లు కోరారు. పట్టణంలో విశ్వబ్రాహ్మణ సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక యంత్రాల ప్రవేశంతో చేతివృత్తులకు ఆదరణ తగ్గిందని, ఈ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులను ఆదుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు దాసోజు శ్రీనివాస్, కొండోజు కృష్ణాచారి, పొందోట సోము, శిరసనగండ్ల ఈశ్వరాచారి, అన్నబీమోజు నాగార్జునాచారి, ఇనుగుర్తి గోవర్ధన్, తాడోజు శ్రీనివాసాచారి, శ్రీపాద కృష్ణమాచారి, రామకృష్ణ, వెంకటాచారి, శ్రీనివాసాచారి, భీష్మాచారి పాల్గొన్నారు.

బస్సు వస్తే బడికి.. లేకుంటే ఇంటికే


శాలిగౌరారంలో బస్సుల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

- బస్సుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం
- పాఠశాలకు గైర్హాజర్ అవుతున్న విద్యార్థులు
- ఇదీ వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థుల దుస్థితి

శాలిగౌరారం, జూన్ 30: బస్సులు లేక మోడల్ స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి ఇంటర్ సెకండియర్ వరకు 800మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేవలం 100మంది విద్యార్థినులకు మాత్రమే హాస్టల్ సౌకర్యం ఉంది. 100 మంది విద్యార్థుల వరకు వల్లాల గ్రామ సమీప గ్రామాలకు చెందిన వారు కాగా సుమారు 600 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి స్కూల్‌లో చదవడానికి వెళ్తున్నారు. వీరంతా బస్సులు నడిస్తేనే స్కూల్‌కు హాజరయ్యే పరిస్థితి. బస్సులు రాకపోతే ఆరోజు విద్యార్థులు ఇంటి వద్దే ఉంటున్నారు. చదువుకోవాలనే ఆపేక్షతో కొంత మంది విద్యార్థులు అష్టకష్టాలు పడి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న వల్లాల పాఠశాలకు ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదంభరితంగా వెళ్తున్నారు. బస్సులు రాకపోతే మరికొంత మంది విద్యార్థులు ఇసుక ట్రాక్టర్లు, ఆటోలను ఆశ్రయించిన ఆర్థికంగా నష్టపోతున్నారు. నల్లగొండ డిపో ఆర్టీసీ అధికారుల బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 3 బస్సులు నడిస్తేనే మండలంలోని 24 గ్రామాల విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. గతంలో నార్కట్‌పల్లి డిపో వారు నకిరేకల్ శాలిగౌరారం రూట్‌లో వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం 3 బస్సులు నడిచేవి. నకిరేకల్ నుంచి అమ్మనబోలు, నకిరేకల్ నుంచి గురజాల, చిత్తలూరు, నకిరేకల్ నుంచి శాలిగౌరారం మండల కేంద్రం వరకు మొత్తం 3 బస్సులు నడిపించేవారు. గతేడాది నుంచి నార్కట్‌పల్లి డిపో నుంచి నల్లగొండ డిపోకు ట్రాన్స్‌ఫర్ చేశారు. నల్లగొండ డిపో నుంచి న కిరేకల్, శాలిగౌరారం రూట్‌లో రెండు బస్సులు నడిపించారు.వారం రోజుల నుంచి రెండు బస్సులు కూడా రాకపోవడంతో విద్యార్థులు ఇంటి వద్దే ఉంటున్నారు. బస్సులు రాకపోవడంతో పాఠశాల హాజరు శాతం తగ్గిందని బస్సులు నడిపించాలని పాఠశాల ప్రిన్సిపాల్ రాగిణి ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం బస్సు లు నడిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడపాలి



వల్లాల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో 800 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కేవలం 100 మంది విద్యార్థినులకు మాత్రమే హాస్టల్ సౌకర్యం ఉంది. గతేడాది నుంచి రెండు అధికారులు రెండు ఆర్టీసీ బస్సులను మాత్రమే నడిపిస్తున్నారు. విద్యార్థులు రెండు బస్సుల్లో కిక్కిరిసిపోయి ఇబ్బందులు పడుతున్నారు. నాలుగురోజులుగా ఒక్కబస్సు కూడా రావడం లే దు.ఇక్కడి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మూడు బస్సులు నడిపితే విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉంటారు.

- జి.రాగిణి, ప్రిన్సిపాల్, వల్లాల మోడల్ స్కూల్

'రైతుభరోసా' పది ఎకరాలకు ఇవ్వాలి

● అభిప్రాయ సేకరణ చేపట్టిన అధికారులు


డిండి: సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు

డిండి, నార్కట్‌పల్లి, తిప్పర్తి, జూన్ 30: ప్రభుత్వం వ్యవసాయ పెట్టుబడి కోసం రైతులకు ఇచ్చే రైతు భరోసా 10 ఎకరాలకు పరిమితి విధించాలని పలువురు రైతులు సూచించారు. ఆదివారం రైతుబంధు, రైతు భరోసా పథకంపై పలు పీఏసీఎస్ ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు వారి భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఐటీ చెల్లింపులతో నిమిత్తం లేకుండా పంట సాగు చేసే విస్తీర్ణానికి రైతుబంధు ఇవ్వాలని, కేవలం 5ఎకరాల లోపు ఉన్నవారికే వర్తింపజేయాలని అన్నారు. మద్దతు ధర ఇస్తే నిజమైన రైతుకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రైతుభరోసా ఇచ్చి మరోవైపు ఎరువులు, యూరియా ధరలు పెంచుతున్నారని విమర్శించారు. రైతులు సేద్యం చేస్తున్న భూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని కోరారు.

డిండి మండల కేంద్రంలో పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాసరావు, నాగార్జునరెడ్డి అధ్యక్షతన తవక్లాపూర్, డిండి సొసైటీ పరిధిలో రైతులతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, జిల్లా వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం సంయుక్తంగా రైతుల నుంచి రైతుభరోసాపై సూచనలు సేకరించారు. కార్యక్రమంలో డీసీవో కిరణ్‌కుమార్, డీఎల్‌సీవో ఖాజా, ఎంపీటీసీ వెంకటయ్య, గుర్రం రాములు, శిమర్ల మల్లయ్య, దశరథరెడ్డి, ఏవో నాగేశ్వర్‌రావు, రాజేందర్‌రెడ్డి, సాయితేజ, మహేశ్వరి, బాల్‌రెడ్డి, అంతిరెడ్డి, కొండల్‌రావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అభిప్రాయాలు సేకరించారు. సంఘం అధ్యక్షుడు కసిరెడ్డి మనోహర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సహకార శాఖ జిల్లా ఆడిట్ అధికారి గోలి శ్రీనివాస్, అసిస్టెంటట్ జిస్ట్రార్ మహమూద్ హాజరై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. సమావేశంలో ఏవో గిరిప్రసాద్, సంఘం ఉపాధ్యక్షుడు బండ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, ఏఈవోలు, సహకార సంఘ కార్యదర్శి బిజ్జాల రవీందర్ పాల్గొన్నారు.

● తిప్పర్తి మండల కేంద్రంలోని రైతువేదికలో డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రైతులు సేద్యం చేస్తున్న భూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ అన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారుల సహకారంతో సాగులో లేని భూములను గుర్తించి పది ఎకరాలలోపు రైతులకు మాత్రమే రైతుభరోసా ఇవ్వాలని సూచించారు. సమావేశంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు ముత్తినేని శ్యాంసుందర్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కందుల రేణుక లక్ష్మయ్య, కిన్నెర అంజి, జాకటి మోష, సీఈవో భిక్షమయ్య, డైరెక్టర్లు బైరోజు బ్రహ్మాచారి, గోద కృష్ణారెడ్డి, రైతులు చిలక శ్రీనివాస్‌రెడ్డి, గుండు శ్రీను, జానయ్య, వెంకట్‌రామ్‌రెడ్డి, రవి, శ్రీరాములు, గిరి పాల్గొన్నారు.

అధికారానికి సేవా గుణం తోడైతే మంచి ఫలితాలు

● డీటీడీవో రాజ్‌కుమార్



కడారి లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

నల్లగొండటౌన్, జూన్ 30: ప్రభుత్వ అధికారికి అధికారంతో పాటు సేవా గుణం తోడైతే మంచి ఫలితాలు వస్తాయని గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఏటీడీవో కడారి లక్ష్మారెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 32 సంవత్సరాలుగా గిరిజన సంక్షేమ శాఖలో ఎస్‌డబ్ల్యూవోగా ఎన్నో అమూల్యమైన సేవలు అందించారని, ఆయన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం పి.గామయ్య, రాష్ట్ర పెన్షనర్ సంఘం అధ్యక్షుడు గుంతకండ్ల దామోదర్‌రెడ్డి, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి శేఖర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, వార్డెన్ల సంఘం జిల్లా కోశాధికారి బాలకృష్ణ, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గొడకొండ్లలో అస్తవ్యస్తంగా పారిశుధ్యం


వేంకటేశ్వరనగర్‌లో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ కాల్వ

చింతపల్లి, జూన్ 30: చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ (మాల్)లో పారిశుధ్యం లోపించింది. ప్రధానంగా మురికి కాల్వల్లో మురుగు నీరు, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో ఈగలు, దోమలు పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాక గ్రామస్థులు సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు. పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విషయంపై గొడకొండ్ల పంచాయతీ కార్యదర్శి పద్మ ను వివరణగా కోరగా సిబ్బందిని ఆదేశించి గ్రామంలో పారిశుధ్య సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని అన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో నేడు 'ప్రజావాణి'

కేతేపల్లి, జూన్ 30: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులను స్వీకరించడానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.శ్రీనివాసరావు తెలిపారు. మండల ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించే ప్రజావాణికి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతిపత్రాలు అందించవచ్చని అన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మునిసిపల్ అత్యవసర సమావేశం నేడు

మిర్యాలగూడటౌన్, జూన్ 30: మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ యూసుఫ్ తెలిపారు. మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన జరిగే సమావేశంలో తుఫాన్ వరదనీరు, కాల్వల పూడిక తదితర అంశాలపై చర్చ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి కౌ న్సిల్ సభ్యులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

అందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

● సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య

శాలిగౌరారం, జూన్ 30: రైతులకు ప్రభుత్వం చేస్తున్న రూ.2లక్షల రుణమాఫీలో ఎలాంటి నిబంధనలు పెట్టకుండా రైతులందరికీ వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి చలకాని మల్లయ్య డిమాండ్ చేశారు. 2018 తర్వాత రుణాలు తీసుకున్న రైతులకు మాత్రమే రుణమాఫీని వర్తింపజేస్తామని ప్రకటించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, నిబంధనల పేరుతో కొర్రీలు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. ఇలాంటి నిబంధనల కారణంగా అనేక మంది రైతులు నష్టపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి నిబంధనలు పెట్టకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇళ్లులేని నిరుపేదలకు తక్షణమే ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల స్థలం ఉన్న వారికి ఇళ్ల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ పథకాల అందజేతలో రాజకీయాలు చేయవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఎం సీనియర్ నాయకులు కల్లూరి లింగయ్య, చలకాని కుమార్, బుచ్చిరాములు, గుండ్లపల్లి వెంకన్న, డెంకాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్‌రావు సేవలు చిరస్మరణీయం


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 30: దివంగత నేత కటికనేని లక్ష్మణ్‌రావు సేవలు చిరస్మరణీయమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి అన్నారు. మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గల పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం దేవరకొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మణ్‌రావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే బాలునాయక్, లక్ష్మణ్‌రావు కుటుంబసభ్యులతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మణ్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. లక్ష్మణ్‌రావు దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, వివిధ హోదాల్లో పనిచేసిన ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. అప్పటి స్పీకర్ నారాయణరావు మండలాన్ని దత్తత తీసుకోవడంతో ఆయన సహకారంతో మండల అధ్యక్షుడిగా ఉన్న లక్ష్మణ్‌రావు ఆ రోజుల్లోనే రెండు ట్రాక్టర్లు, అంబులెన్స్ ఏర్పాటు చేసేలా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చందర్‌రావు, రమావత్ రవీంద్రకుమార్, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జాన్‌యాదవ్, యాదగిరిరావు, జిల్లా పార్టీ కాంగ్రెస్ నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వీరబోయిన ఎల్లయ్య, నాయకులు సతీష్‌రెడ్డి, మాధవరావు, వేణుమాధవరావు, మట్టిమనిషి పాండురంగరావు, పరమేష్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రవి

● ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి

చండూరు, జూన్ 30: జనాభా దామాషా ప్రాతిపదికన మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురుపాటి సుదర్శన్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రిజర్వేషన్‌లో భాగంగా మాదిగలకు 7శాతం ఇస్తే మాదిగలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన కాలంలో మాదిగలు రాష్ట్రంలో అతిపెద్ద కులంగా అవతరించిందని, జనాభా దామాషా ప్రకారం 12శాతం రిజర్వేషన్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా మాదిగలు ఉన్నారని, రిజర్వేషన్లు కల్పిస్తే అభివృద్ధి చెందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో యూత్ అధ్యక్షుడు నక్క మహేష్, జోగు గణేష్, బొరెల్లి సురేష్, జిల్లా కార్యదర్శి దండు పరశురాం, నాగార్జునసాగర్, మునుగోడు, దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ అధ్యక్షులు బుడిగపాలక లక్ష్మణ్, మేడి చంద్రస్వామి, నాగిళ్ల రవి, నాయకులు కలకొండ పరమేష్, జంగయ్య, పందుల సురేష్, కురుపాటి రవి, శంకర్, జగాల్, సురేష్ తదతరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: ఎమ్మెల్యే బాలునాయక్‌కు రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని బంజారా సంఘం నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రమావత్ తుల్సానాయక్ కోరారు. రవీంద్రనాయక్ మంత్రి తర్వాత మంత్రి పదవి లేకపోవడంతో ఈ ప్రాంతం వెనుకబడిందని, బాలునాయక్‌కు మంత్రి పదవి కేటాయిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

దేవరకొండ: దళితులంతా ఐక్యంగా అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ అంకూరి శివకుమార్ అన్నారు. దేవరకొండలో అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత వస్కుల సత్యనారాయణను ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అంకూరి వెంకటయ్య, నాయకులు పొట్ట బుచ్చయ్య, ప్రసాద్, రాజు, అంకూరి శ్రీను, రాములు పాల్గొన్నారు.

శాలిగౌరారం: శాలిగౌరారం ఎంపీడీవో రేకల లక్ష్మయ్య శనివారం పదవీ విరమణ పొందడంతో కార్యాలయ సూపరింటెండెంట్ గాదరి సుందరయ్య ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమితులయ్యారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

మిర్యాలగూడ టౌన్: పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయ సంఘం నాయకులు సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ దశాబ్దకాలంగా పదోన్నతులు, బదిలీల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయుల మొర ఆలకించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బంజారా ఉద్యోగుల సంఘ నాయకులు దశరథనాయక్, గోపి, మోతీలాల్, అనంతరాములు, తులసీరాం, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకుడు చింతపల్లి బాలకృష్ణ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఖమ్మం పట్టణంలో డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ఆయన ప్రకటించారు.

వేములపల్లి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని యువతతో ఆయన ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. గ్రామంలోకి మాదకద్రవ్యాలు రాకుండా యువత అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో నక్క శ్రీధర్, ధూపాటి సందీప్, తంగెళ్ల సైదిరెడ్డి, కట్టా వినయ్‌కుమార్, రాచూరి రుషి, మనోహర్, విజయ్, శ్రీకాంత్, మధు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్: నల్లగొండకు చెందిన డాక్టర్ అమరేందర్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. భోపాల్‌లోని మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డికి మధ్యప్రదేశ్ రాష్ట్ర సీఎం మోహన్‌యాదవ్, విద్యాశాఖ మంత్రి ఇంద్రసింగ్‌పర్మార్, ఆరోగ్య జాతీయ భారత ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర శర్మ, యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నుంచి ఆయన డాక్టరేట్ స్వీకరించారు.

చిట్యాల: చిట్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు సుంకరి మల్లేష్‌గౌడ్ తెలిపారు. సభ్యత్వం కావాలనుకునే వారు భూమి పాస్‌బుక్, ఆధార్‌కార్డుతో పాటు రూ. 330లు చెల్లించి సభ్యత్వం పొందాలని సూచించారు.

శాలిగౌరారం: శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని మార్కెట్ కాలనీకి చెందిన వేముల రమేష్ రాజస్థాన్ రాష్ట్రంలోని సన్‌రైజ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్‌ను పొందారు. హైపర్‌గ్లైసిమియా, డయాబెటిక్ కెమికల్ పరిశోధన విభాగంలో రీసెర్చ్ ఆన్ క్రిటికల్ స్టడీస్ ఆఫ్ సింథసిస్ ఆఫ్ సెర్టైన్ హెటిరోసైక్లిక్ నైట్రోజన్ అండ్ సల్ఫర్ పొటెన్షియల్ అమలైజ్ ఇనిహిబిటర్స్ అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతాప్‌భాను పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించింది. డా క్టరేట్‌ను సాధించడంపై అతని కుటుంబీకులు, గ్రామస్థులు, స్నేహితులు రమేష్‌ను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

మర్రిగూడ: నాంపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ విద్యార్థినులకు నీటి కొరత ఉన్నందున కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోరు వేసి నీటి దాహార్తిని తీర్చారు. నీటి ఇబ్బంది గురించి పాఠశాల సిబ్బంది ద్వారా తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ కసూర్తి శ్రీచరణ్ స్పందించి బోర్ వేశారు. దీంతో ఆయనకు పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

మిర్యాలగూడ టౌన్: బ్యాడ్మింటన్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జిల్లాకు పేరు తేవాలని సంఘం జిల్లా కార్యదర్శి తోట రంగారావు అన్నారు. పట్టణంలోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన డిస్ట్రిక్ట్ లెవల్ సెలక్షన్స్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్-15, అండర్-17 విభాగాలలో ఎంపికైన నల్లగొండ, సూర్యాపేట జిల్లా క్రీడాకారులకు అభినందించారు. కార్యక్రమంలో జిల్లా కోచ్ మారబోయిన రామకృష్ణ, నవీన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయాలని జడ్పీటీసీ కంకణాల ప్రవీణ అన్నారు. ఎన్నికల హామీలైన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలుచేయాలని డిమాండ్ చేశారు. మహిళల సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు.

పనులను అడ్డుకున్న అధికారులు

డిండి, జూన్ 30: ప్రభుత్వ భూమిని ఎలాంటి అనుమతి లేకుండా చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఈ సంఘటన మండలంలోని డి.నెమలిపూర్ గ్రామ శివారులో ఆదివారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మండలం డి.నెమలిపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా యంత్రాలతో పనులు చేస్తుండగా రెవెన్యూ సిబ్బంది పనులు నిలిపివేశారు. నెమలిపూర్ సాకిబండ వద్ద సర్వేనెంబర్ 147లో 42.25 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా ఇందులో 33.05 ఎకరాలు రైతుల ఆధీనంలో ఉన్నాయి. మరో 9.20 గుంటలు మిగులు భూమిగా ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చూపుతున్నాయి. అదే భూమికి అనుసరించుకొని ఓ రైతు భూమి ఉండటంతో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి గుట్టలను తొలగించి చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది ఆ పనులను నిలిపివేశారు.